బండి సంజయ్ పీఎస్‌గా ఆంధ్ర వంశీ

- కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- డైనమిక్ ఆఫీసర్‌గా ఆంధ్ర వంశీకి గుర్తింపు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రైవేట్ సెక్రటరీగా (పీఎస్) ఐఏఎస్ అధికారి ఆంధ్ర వంశీ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సంజయ్‌కు వంశీ ఐదేండ్లపాటు పీఎస్‌గా కొనసాగుతారని ఆ ఉత్తర్వుల్లో వెల్లడించింది. కాగా, ఆంధ్ర ప్రదేశ్‌లోని ఒంగోలుకు చెందిన ఆంధ్ర వంశీ 2011లో యూపీఎస్సీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఐఏఎస్ అయ్యారు. ఉత్తరప్రదేశ్ బస్తీ జిల్లాలోని వందలాది గ్రామాల్లో దాదాపు 30 ఏండ్లుగా పరిష్కారంకాని 50 వేల ఫిర్యాదులను కేవలం నాలుగు నెలల్లోనే పరిష్కరించారు. అలా ఉద్యోగంలో చేరిన అతి తక్కువ కాలంలోనే సమర్థవంతమైన, డైనమిక్ ఆఫీసర్‌గా ఆయన పేరు తెచ్చుకున్నారు. యూపీలోని మథుర, ప్రయాగ్‌రాజ్, ఝాన్సీ, ఫిలిబిత్, షాజహాన్‌పూర్ తదితర జిల్లాల్లో కలెక్టర్‌గా పనిచేశారు. 2006లో హైదరాబాద్ జేఎన్టీయూ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో వంశీ బీఏ పూర్తి చేశారు. ఆ తర్వాత కొంతకాలం యాక్సెంచర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేశారు. 2008లో ఆదాయపు పన్ను శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా ఉద్యోగం సాధించారు. తర్వాత సివిల్స్‌కు ప్రిపేరయ్యారు. 2011లో ఐఏఎస్ అధికారిగా నియమితులయ్యారు.

నేటినుంచి మూడు రోజులు గవర్నర్ పర్యటన

యాదాద్రి, ములుగు, భూపాలపల్లి జిల్లాల టూర్

ములుగు, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ)/భువనగిరి కలెక్టరేట్/యాదగిరిగుట్ట: గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ మంగళ, బుధ, గురువారాల్లో పలు జిల్లాల్లో పర్యటించనున్నారు. మంగళవారం ఉదయం 8 గంటలకు రోడ్డు మార్గాన యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుంటారు. అక్కడి నుంచి బయలుదేరి ఉదయం 11.30 గంటలకు ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకుంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో 25 మంది జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు పొందిన రచయితలు, కళాకారులతో సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి చేరుకొని పూజలు నిర్వహించిన అనంతరం సరస్సును సందర్శించనున్నారు. అక్కడి నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురంలోని కోటగుళ్లను సందర్శించి పూజలు చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం బుస్సాపురంలోని లక్నవరం సరస్సు వద్దకు చేరుకొని హరిత రిసార్ట్‌లో ఇతర అధికారులతో కలిసి రాత్రి బస చేయనున్నారు. బుధవారం ఉదయం 8 గంటలకు లక్నవరం నుంచి హనుమకొండ జిల్లా పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నెల 29న మధ్యాహ్నం 2.20 గంటలకు ఆలేరు మండలంలోని కొలనుపాక జైన దేవాలయాన్ని, సోమేశ్వర ఆలయాన్ని దర్శించుకుంటారు. మధ్యాహ్నం 3.30 గంటలకు భువనగిరి పట్టణ పరిధిలోని స్వర్ణగిరి ఆలయాన్ని సందర్శిస్తారు. సాయంత్రం 5.15 గంటలకు భువనగిరి కలెక్టరేట్‌లో రచయితలు, కళాకారులు, ప్రముఖులు, రాష్ట్ర జాతీయ అవార్డు గ్రహీతలను కలుస్తారు.

అత్యవసర నిర్ణయాల్లోనూ నాన్చుడే

- సమయం మించిపోతున్నా పట్టని ప్రభుత్వం
- పీకల మీదికి వచ్చాక హడావుడి ప్రకటనలు
- ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం పలు అంశాల్లో వేగంగా నిర్ణయాలు తీసుకోవడంలో విఫలమవుతున్నది. సమయం మించిపోతున్నా పట్టించుకోవడం లేదు. కొన్ని విషయాల్లో పీకల మీదికి వచ్చాక హడావుడి నిర్ణయాలు తీసుకుంటున్నది. ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందుకు ఇటీవలి స్థానికత అంశమే ప్రత్యక్ష ఉదాహరణ. ఇదే కాదని, ఇలాంటివి ఎన్నో ఉన్నాయని బాధితులు ఆరోపిస్తున్నారు.

జనవరి నుంచే చెప్తున్నా..

ఉమ్మడి కోటా పూర్తవుతున్న నేపథ్యంలో విద్యాసంస్థల్లో ప్రవేశాల స్థానికతపై నిర్ణయం తీసుకోవాలని ఈ ఏడాది జనవరి నుంచే ప్రభుత్వానికి వివిధ రూపాల్లో వినతులు అందాయి. అయినా పట్టించుకోలేదు. చివరికి జూలైలో హడావుడిగా నిర్ణయం తీసుకున్నది. ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ల నోటిఫికేషన్‌తో పాటు జీవో 33ని విడుల చేసింది. దీంతో వివాదం చెలరేగింది. ప్రభుత్వం ముందు నుంచే దృష్టిపెడితే ఈ సమస్య వచ్చేది కాదని నిపుణులు పేర్కొంటున్నారు.

కేసీఆర్ కిట్ ఉన్నట్టా? లేనట్టా?

మాతాశిశు సంరక్షణ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ కిట్ ప్రవేశపెట్టి రూ.15వేల ఆర్థికసాయం అందించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పథకం పేరును తీసేసింది. ప్రస్తుతం తాత్కాలికంగా ఎంసీహెచ్ కిట్‌గా పిలుస్తున్నారు. గతంలో సొంతంగా రాష్ట్ర ప్రభుత్వమే ఖర్చు చేయగా, ఇప్పుడు 'ప్రధానమంత్రి మాతృవందన యోజన'ను కలిపి అమలుచేయాలని, కొత్త పేరు పెట్టాలని భావిస్తున్నది. ఈ విషయమై ఇప్పటికీ తుది నిర్ణయం తీసుకోలేదు.

ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు ఏవీ?

ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద వందలాది మంది విద్యార్థులు విదేశాల్లో విద్యనభ్యసిస్తున్నారు. అయితే ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో వారు ఫీజులు కట్టలేక సతమతమవుతున్నారు. కొందరు అప్పు చేసి ఫీజులు కట్టుకుంటున్నారు. మరికొందరు చదువు మధ్యలోనే ఆపేసే పరిస్థితి నెలకొన్నది.

ఆలస్యంగా చేపపిల్లల టెండర్లు

ఉచిత చేపపిల్లల పంపిణీ పథకానికి సాధారణంగా ఏప్రిల్‌లో టెండర్లు పిలిచి ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం జూలైలో ఈ ప్రక్రియ ప్రారంభించింది. వానలు మొదలయ్యాక టెండర్లు పిలిచింది. కొన్ని జిల్లాల్లో ఇప్పటికీ టెండర్లు పూర్తికాలేదు.

పెంచిన మెస్‌చార్జీలు అమలెప్పుడు?

సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను 25శాతం మేరకు పెంచాలని చేసిన ప్రతిపాదనలు ప్రభుత్వం వద్దే పెండింగ్ ఉన్నాయి. పెరిగిన ధరలతో కాంట్రాక్టర్లు నాసిరకం సరుకులు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో తరుచూ ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయని చెబుతున్నారు.

డీఎస్సీ-2008 బాధితులకు ఉద్యోగాలేవీ?

డీఎస్సీ-2008 బాధితులకు ఉద్యోగాలు ఇవ్వాలని రాష్ట్ర క్యాబినెట్ ఈ ఏడాది ఫిబ్రవరి 24న నిర్ణయించింది. ఏపీ తరహాలో ఎంటీఎస్ పద్ధతిలో నియామకాలు చేపడుతామని చెప్పింది. విధివిధానాల ఖరారు బాధ్యత జీవో 317 క్యాబినెట్ సబ్ కమిటీకి అప్పగించింది. ఆరు నెలలు గడుస్తున్నా సబ్ కమిటీ నిర్ణయం తీసుకోలేదు. ఈ నెల 27లోగా పూర్తి చేస్తామని న్యాయస్థానానికి ప్రభుత్వం హామీ ఇచ్చింది.

గురుకుల అభ్యర్థులపై నిర్ణయం ఎప్పుడు?

రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ గురుకులాల్లో 8,708 పోస్టులకు ట్రిబ్ నియామక ప్రక్రియ చేపట్టింది. 1:2 పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేసింది. అయితే ట్రిబ్ డిసెండింగ్ ఆర్డర్‌ను పాటించకపోవడం, ఇష్టారాజ్యంగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టడంతో భారీగా బ్యాక్‌లాగ్‌లు ఏర్పడుతున్నాయని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డౌన్‌మెరిట్ అమలుచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	35.4°c	24.0°c
నిజామాబాద్	32.3°c	23.5°c
రంగారెడ్డి	32.2°c	21.6°c
కరీంనగర్	32.0°c	24.0°c
వరంగల్	32.0°c	24.0°c
ఖమ్మం	32.0°c	24.0°c
నల్లగొండ	32.0°c	23.2°c
హైదరాబాద్	31.0°c	23.8°c
మెదక్	30.3°c	23.0°c
మహబూబ్‌నగర్	29.2°c	22.5°c

రాష్ట్రవ్యాప్తంగా 31 వరకు వర్షాలు

- 29, 30 తేదీల్లో పలుచోట్ల భారీ వర్షాలు
- హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో రాగల ఐదురోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురిసినట్టు అధికారులు తెలిపారు. 27న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. 28న ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో వానలు కురుస్తాయని పేర్కొంది. 29, 30 తేదీల్లో పలుచోట్ల భారీ వర్షాలకు తోడు ఈదురు గాలులు వీస్తాయని, పిడుగులు పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురిస్తే స్కూళ్లకు సెలవులు ఇవ్వటానికి అధికారులు సిద్ధమయ్యారు. గడిచిన 24 గంటల్లో ములుగు, వరంగల్, కామారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. ములుగుజిల్లా కన్నాయిగూడెంలో 4.36 సెం.మీ వర్షంపాతం నమోదైంది.

పొంగులేటి కంపెనీకి 4,495 కోట్ల పనులు

మొదటిపేజీ తరువాయి...

రూ.60.82 కోట్లు, ఈపీడీసీఎల్ నుంచి రూ.75.54 కోట్ల మేర బిల్లులు మంజూరయ్యాయి. ఈ పనులకు సంబంధించి కొన్ని రోజులుగా వివాదాలు నడుస్తున్నాయి. టెండర్లు దక్కించుకోవడమే తప్ప పనులు చేపట్టలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ మేరకు ఇటీవల ఏపీ ప్రభుత్వం రాఘవ కన్స్ట్రక్షన్‌కు నోటీసులు జారీచేసింది. విశాఖపట్నంతోపాటు వరద ప్రభావిత ప్రాంతాల్లో భూగర్భంలో విద్యుత్తు లైన్లు వేసే కాంట్రాక్టును దక్కించుకొని ఏడాది గడిచినా పనులు ఎందుకు మొదలు పెట్టలేదని ఈ ఏడాది జూలైలో ప్రభుత్వం నోటీసులు ఇచ్చింది. 2022లో పనులు అప్పగించినా ఇంకా ప్రారంభించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. వెంటనే మొదలుపెట్టకుంటే చర్యలు తప్పవని హెచ్చరించింది. దీనికితోడు ఎగ్జిం బ్యాంకు నుంచి గ్యారెంటీ పొందడంపై తాజా వివాదం మొదలైంది. నెల్లూరు జిల్లాతోపాటు పలు ప్రాంతాల్లో ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌కు సంబంధించిన రూ.800 కోట్ల పనులకు వెస్టిండీస్‌కు చెందిన ఎగ్జింబ్యాంకు నుంచి రూ. 80 కోట్ల బ్యాంకు గ్యారెంటీ సమర్పించారు. దేశంలోనే ఒక్క శాఖ కూడా లేని బ్యాంకు నుంచి గ్యారెంటీ ఎలా తెస్తారన్న చర్చ సోషల్ మీడియాలో మొదలైంది. ఎగ్జిం బ్యాంకు పూర్వాపరాలను వెలికి తీస్తున్నారు. దేశంలో ఈ బ్యాంకుకు ఒక్క లావాదేవీ కూడా లేకపోవడం అందరినీ నివ్వెరపరుస్తున్నది. సాధారణంగా బ్యాంకులు ప్రతి ఏటా తమ లాభనష్టాలను ప్రకటిస్తుంటాయి. కానీ, ఈ బ్యాంకు వివరాలు ఎక్కడా లేవు. 2021 ఏప్రిల్ నాటికి తమ సంస్థ విలువ 227 మిలియన్ డాలర్లు అని ఒకసారి, మరోసారి 230 మిలియన్ డాలర్లు అని బ్యాంకు ప్రకటించడంపైనా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎగ్జింబ్యాంకు ఏపీలో మొత్తం 31 ప్రాజెక్టులకు గ్యారెంటీ ఇచ్చిందని, వీటి విలువ రూ.481 కోట్లని చెప్తున్నారు.

ఒక్కడినీ గెలవనియ్యి

- ఆ మంత్రిని పాతర పెట్టకపోతే నా పేరు తీన్మార్ మల్లన్నే కాదు
- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, ఆగస్టు 26(నమస్తే తెలంగాణ): 'వాళ్లంతా కలిసి మూకుమ్మడిగా నన్ను ఓడించేందుకు కుట్ర చేశారు. మీరు రాసిపెట్టుకోండి.. మిత్తి, అసలు, చక్రవడ్డీ కలిపి వచ్చే ఎన్నికల్లో ఒక్కడు కూడా గెలవకుండా పాతర పెట్టకపోతే నా పేరు తీన్మార్ మల్లన్నే కాదు' ఇవీ ఆదివారం కాజీపేటలో జరిగిన ఒక సమావేశంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన సంచలన వ్యాఖ్యలు. ఆయన ఈ వ్యాఖ్యలు ఏ మంత్రిని ఉద్దేశించి చేశారనే చర్చ జోరుగా జరుగుతున్నది. ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ సమయంలో విదేశాల్లో ఉన్న ఒక మంత్రి ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్(కలెక్టర్)కు ఫోన్ చేసి తాను ఓడిపోయే అవకాశం ఏమైనా ఉన్నదా? అని ఆరా తీశారని మల్లన్న చెప్పారు. తనను ఓడించేందుకు కుట్ర చేసిన వాళ్లలో ఒక్కడిని కూడా వచ్చే ఎన్నికల్లో గెలవనివ్వనని, అలా చేయకపోతే తన పేరు తీన్మార్ మల్లన్నే కాదని శపథం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో మంత్రి కోమటిరెడ్డి అమెరికా పర్యటనకు వెళ్లడంపై అప్పట్లోనే రకరకాల చర్చలు జరిగాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు మల్లన్న వ్యాఖ్యలు కోమటిరెడ్డిని ఉద్దేశించినవనే ప్రచారం జోరందుకుంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేయకపోతే భూకంపం సృష్టిస్తా.. రాసిపెట్టుకోరి ప్రభుత్వాన్ని మల్లన్న హెచ్చరించడం గమనార్హం.

మాలలకు అన్యాయం జరగకుండా చూడండి

సీఎంకు మాల సామాజికవర్గ ప్రతినిధుల విజ్ఞప్తి

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణలో మాలలకు అన్యాయం జరగకుండా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మాల సామాజిక వర్గం నేతలు కోరారు. సోమవారం సచివాలయంలో ఎంపీ గడ్డం వంశీ, ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి, మట్టా రాగమయి, వంశీకృష్ణ, నాగరాజు, మాల మహానాడు నేత చెన్నయ్య సీఎంతో భేటీ అయ్యారు. ఎస్సీ వర్గీకరణపై కోర్టు తీర్పునకు అనుగుణంగా మాల, మాదిగలకు సరైన న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సీఎం స్పందిస్తూ.. కమిటీని నియమించి అధ్యయనం చేసి, నివేదిక ఆధారంగా అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

15 రోజుల్లో వీసీలు, ప్రొఫెసర్ల నియామకం

- సివిల్స్ మెయిన్స్‌కు ఎంపికైన 135మందికి అభయహస్తం
- ఇంటర్వ్యూకు ఎంపికైతే మరో రూ.లక్ష ప్రోత్సాహకం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సివిల్స్ మెయిన్స్‌కు అర్హత సాధించిన అభ్యర్థులకు సింగరేణి సంస్థ అందజేసిన రూ.లక్ష చెక్కును అందజేస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు దుద్దిళ్ల, పొన్నం

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు రాబోయే 10 -15 రోజుల్లో వైస్‌చాన్స్‌లర్లు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల నియామకం చేపడతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్రం నుంచి సివిల్స్ మెయిన్స్‌కు అర్హత సాధించిన 135 మందికి సోమవారం సచివాలయంలో రాజీవ్ సివిల్స్ అభయహస్తం కింద రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ.లక్ష పెద్ద మొత్తం కాకపోవచ్చని, కానీ ప్రభుత్వం మీ వెనుక ఉందనే ఆత్మవిశ్వాసం కల్పించడానికి ఇస్తున్నామని చెప్పారు. మెయిన్స్ నుంచి ఇంటర్వ్యూకు ఎంపికైతే మరో రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. తాము అధికారంలోకి వచ్చిన 90రోజుల్లోనే 30వేల ఉద్యోగాలు ఇచ్చామని, గ్రూప్ -1, 2, 3, డీఎస్సీతో కలిపి మరో 35 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామని చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వసతిగృహాలన్నీ ఒకే చోట ఉండేలా వంద నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నిరుద్యోగ సమస్య నిర్మూలనకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం వృథా కాకుండా 2 వేల మందికి శిక్షణ ప్రారంభిస్తున్నామని, వచ్చే ఏడాది నుంచి 20వేల మందికి శిక్షణ ఇస్తుందని తెలిపారు. ఒలింపిక్స్‌లో పెద్దసంఖ్యలో పతకాలు సాధించేలా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీకి రూపకల్పన చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, కోరం కనకయ్య, మాలోత్ రాందాస్ నాయక్, మట్టా రాగమయి, గండ్ర సత్యనారాయణరావు, గడ్డం వివేక్‌వెంకటస్వామి, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, గడ్డం వంశీ, సింగరేణి సీఎండీ బలరాం, సీఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

సొమ్మొకరిది.. సోకొకరిది

సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ) కింద సింగరేణి సంస్థ సివిల్స్ మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తున్నది. కాగా, ఆ చెక్కులను అభ్యర్థులకు అందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ ఖాతాలో వేసుకోవడంపై విమర్శలు వస్తున్నాయి.

పోచారం, అమిత్‌కు అధిష్ఠానం ఝలక్?

- వీరి నియామాకాలపై అభ్యంతరం.. బాధ్యతల స్వీకరణ వాయిదా?
- ఉత్తర్వులిచ్చి వారం రోజులైనా ఊసే లేదు

హైదరాబాద్, ఆగస్టు 26(నమస్తే తెలంగాణ): ఇటీవల బీఆర్ఎస్ నుంచి వెళ్లిపోయి కాంగ్రెస్ కండువా కప్పుకొని వ్యవసాయ శాఖ సలహాదారుగా నియమితులైన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డికి కాంగ్రెస్ అధిష్ఠానం ఝలక్ ఇచ్చినట్టు సమాచారం. వారి నియామకాలపై అభ్యంతరం వ్యక్తమైనట్టు తెలిసింది. అందుకే పదవీ బాధ్యతలు చేపట్టలేదంటూ పార్టీలో జోరుగా చర్చ జరుగుతున్నది. వీరి నియామకంపై ఉత్తర్వులు వెలువడి వారం గడుస్తున్నా బాధ్యతల స్వీకరణ ఊసెత్తకపోవడం గమనార్హం. వీరి నియామకానికి వ్యతిరేకంగా సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. కొత్తగా పార్టీలో చేరిన వారికి వెంటనే పదవులివ్వడంపై ఆయన అభ్యంతరం వ్యక్తంచేసినట్టు సమాచారం. దీంతో అధిష్ఠానం వారి నియామకాలను ఆపేయాలని రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇది పరోక్షంగా సీఎం రేవంత్‌రెడ్డికి కూడా భంగపాటేననే అభిప్రాయాలు పార్టీలో వ్యక్తమవుతున్నాయి.

పార్టీలో తీవ్ర వ్యతిరేకత

పోచారం శ్రీనివాస్‌రెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డికి కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇవ్వడంపై పార్టీలో అంతర్గతంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఎన్నో ఏండ్లుగా పార్టీ జెండా మోస్తూ కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నవారిని పక్కనపెట్టి, కొత్తగా పార్టీలో చేరిన వారికి పదవులు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుత్తా అమిత్‌రెడ్డి నియామకంపై నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వర్గీయులు అగ్గిమీద గుగ్గిలమవుతున్నట్టు తెలిసింది. ఎన్నో ఏండ్లుగా పార్టీ కోసం పని చేసిన మోహన్‌రెడ్డి, శంకర్‌నాయక్ వంటి వారికి ఇంకా పదవులే దక్కలేదని, ఇప్పుడు పార్టీలో చేరిన గుత్తా అమిత్‌కు రెడ్ కార్పెట్ పరిచి చైర్మన్ పదవి ఇవ్వడమేమిటని వారు ప్రశ్నిస్తున్నట్టు సమాచారం. నల్లగొండలో ఇప్పటికే రేవంత్ వర్గానికి చెందిన చాలామందికి పదవులు దక్కడంపై కూడా ఆ జిల్లా నేతలు ఆగ్రహంతో ఉన్నారు. ఇదే విధంగా చూస్తూ పోతే జిల్లాలో తమ ఉనికే ప్రశ్నార్థకం చేస్తారని, తమను నమ్ముకున్న వారికి మొండిచెయ్యే మిగులుతుందని కీలక నాయకులు భావిస్తున్నట్టు తెలిసింది. అందుకే పదవుల నియామకంపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించినట్టు సమాచారం.

బీసీ సదస్సులో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య

బీసీ రిజర్వేషన్లు పెంచకుంటే రణరంగమే

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య హెచ్చరిక

కడ్తాల్, ఆగస్టు 26: జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని, లేని పక్షంలో బీసీల ఉద్యమాలతో రాష్ట్రం రణరంగం అవుతుందని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్ అధ్యక్షతన సోమవారం మైసిగండి గ్రామంలో నిర్వహించిన బీసీల రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించేందుకు అన్ని రాజకీయ పార్టీలు స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశ జనాభాలో దాదాపు సగం మేరకు ఉన్న బీసీల అభివృద్ధి గురించి ఇప్పటివరకు ఏ రాజకీయ పార్టీ ఆలోచించలేదని విమర్శించారు. ప్రజాస్వామ దేశంలో బీసీలు బిచ్చగాళ్లు కాదని వాటాదారులని, బీసీలకు అన్యాయం చేస్తే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. బీసీల రిజర్వేషన్లను చట్టసభల్లో 50 శాతానికి, విద్య, ఉద్యోగాల్లో 56 శాతానికి పెంచాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, ఏటా రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని కోరారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే కులగణనను చేపట్టి, బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని, ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎన్నికలను అడ్డుకుంటామని, ప్రతి నియోజకవర్గంలో బహిరంగ సభలను నిర్వహించి ప్రభుత్వం తీరును ఎండగడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నందగోపాల్, బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, ఉపాధ్యక్షుడు పెద్దయ్యయాదవ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, కన్వీనర్ భాస్కర్, బీసీ రక్షక్ దళ్ నాయకులు ఉదయ్ నేత తదితరులు పాల్గొన్నారు.

తేలుకుట్టిన దొంగలు

మొదటిపేజీ తరువాయి...

హోదాను వాడుకోవడం ద్వారా ఈ ముఠా మోసాలకు పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలోనే ముఠా అధికార పార్టీకి చెందిన దక్షిణ తెలంగాణ ఎంపీ పేరును కూడా వాడినట్టు గుర్తించారు. ఈ ముఠా నాయకుడు కొద్ది రోజుల క్రితం ఒక కాంట్రాక్టర్‌కు రూ. 25 కోట్ల బిల్లును ఒకే ఒక్క రోజులో క్లియర్ చేయించాడట. ఎట్లా చేయించాడు? ఎవరి సాయం తీసుకున్నాడు? అన్నది రహస్యం. అనూహ్య రీతిలో బిల్లు క్లియర్ చేయించడంతో అతడు అధికార పార్టీ నేతలకు సన్నిహితుడనే నమ్మకం అందరికీ కలిగింది. దీనికి తోడు కాంగ్రెస్ ముఖ్యుల పేరు చెప్పి ఒకట్రెండు పార్ట్‌టైమ్ ఉద్యోగాలు కూడా పెట్టించాడట. బదిలీల కోసం కొందరు ఉద్యోగులను ప్రిన్సిపల్ సెక్రటరీతో కూడా కలిపించాడట. వీటిన్నింటినీ చూసి నమ్మకం కుదిరిన పలువురు ఇతరత్రా పనుల కోసం ఆ ముఠా నేతకు డబ్బులు సమర్పించుకున్నారు. అయితే ఆ పనులను ఆయన చేయించలేకపోయాడు. దీంతో మోసకారి అన్న విషయం బయటపడింది. మోసపు సంపాదనలో ఎక్కువ భాగాన్